......యశమునం దనురక్తియు
ప్రకృతి సిద్ధ గుణంబులు సజ్జనాళికిన్.

# కీర్తికాముడు సూరన్న

**సత్యమూర్తి**

మగ పెళ్ళివారి తరఫున పెండ్లికి వెళ్ళడం సర్వవిధాలా శ్రేయస్కరం. ఇస్త్రీ మడతలు నలగకుండా కావలసినవన్నీ కాళ్ళ ముందుకు తెప్పించుకోవచ్చు. ఒక మనిషి లేవలేని స్థితిలో ఉన్నప్పుడు ఆయనకు చాకిరీ చెయ్యడానికి కనీసం అరడజను మందైనా అవసరం. మగ పెళ్ళి వారివైపు పెళ్ళికి వచ్చి లేవకూడని స్థితిలో కూర్చున్న వందలాది అతిథులకు ఎంత డబ్బూ, బలగం ఉన్న కన్యాదాతైనా లోటు లేకుండా సరిదిద్దుకు రావడం అసాధ్యం. కన్యాదాత రాజుగారైతే మహారాజును వియ్యంకుడుగా కోరుకుంటాడు. తద్వారా ఎంత చెట్టుకు అంత గాలి అన్న సామెత కార్యరూపం దాల్చుతుంది. మగ పెళ్ళివారికి అన్ని విధాలా లోటుపాట్లు లేకుండా సరిపుచ్చుకు రావడంలో అసాధ్యం రాజుగారికీ ఏర్పడుతుంది.

వ్యక్తిగతంగా ప్రతివాడికీ సానుభూతి ఉంటుంది. అందరూ సన్మార్గులే. ఇక చిక్కెక్కడ వస్తుందంటే పదిమందితో కలసినపుడు. ఇల్లు కట్టడం, పెండ్లి చేయడం కష్టతరమైన కార్యమా కాదా? అని ప్రశ్నిస్తే ఏ మాత్రం వ్యవధి తీసుకోకుండా అవునని బుర్ర ఊపుతాడు ప్రతివాడూ. ఆ మనిషే మగ పెళ్ళివారి తరఫున పెళ్ళికి వచ్చాడంటే పట్టపగ్గాలుండవు. ఫొటో తీయించుకోవడం, పెళ్ళికి వెళ్లడం యీ రెండూ సాధారణ వ్యక్తి స్వరూపంలో వీలుపడినంత వ్యత్యాసం తీసుకొస్తాయి. ముఖ పరిచయం ఉన్న మనిషి ఆనవాలు పట్టలేని రూపభేదం కూడా ఏర్పడుతుంది. ఒక సంవత్సరంలో మిల్లులు తయారుచేసిన బట్టల్లో ఆర్థిక సౌలభ్యాన్ని బట్టి తనుకొనుక్కున్న మంచి బట్ట పెండ్లి ప్రయాణీకుణ్ణి అలంకరిస్తుంది. సాధారణంగా బనీను, అంగవస్త్రము, గావంచాతో తృప్తిపడే మనిషి దుస్తుల ఆకారంలో మార్పును కోరుకుంటాడు. నిండు చేతుల లాల్చీ, బొటన వ్రేలు వరకూ వ్రేలాడే పంచె, జరితారు కండువా యిలాంటి వన్నీ కావాలి. ఆర్థిక నీరసత్వం బాగా ప్రబలి పెండ్లికి పనికివచ్చే బట్టలు సంవత్సరంలో ఒకటికూడా తను కొనుక్కోలేకపోతే పొరుగువాడిని ఎరువు అడగవచ్చు. ఎంత కులవివక్షత కల్గిన సమాజమైనా అది పరిగణించకుండా యిరుగువాడికి ఎరువిస్తుంది. వ్యక్తి రూపచిత్రణలో మార్పులు వచ్చినట్లే స్వభావంలో కూడా మార్పులు కలుగుతూంటాయి. పెండ్లికుమార్తెదో ఊరైతే మజాకూరు గ్రామ కాపురస్థుడే పెండ్లి కుమారుడూ కూడా అనుకోండి. అప్పుడైనా పెండ్లికొడుకు అప్పచెల్లెళ్ళూ, అన్నదమ్ములూ; పెండ్లికుమార్తె అప్పచెల్లెళ్ళూ, అన్నదమ్ముల కంటె ఆధిక్యత చూపుతూనే ఉంటారు. ఒకే ప్రాథమిక పాఠశాలలో చదువుకొనే పెండ్లికుమారుని తమ్ముడు, పెండ్లికుమార్తె సోదరుని కంటే తెలివిహీనుడు కావచ్చు; గురువుగారి చేత అనుదినం చీవాట్లూ, చెప్పుదెబ్బలూ అక్షయంగా అనుభవిస్తూఉండొచ్చు; అయినా ఊరేగింపు కారులో పెండ్లి కుమారుని సోదరుడే ఏడ్చయినా ముందు ఎక్కగలుగుతాడు.

పదిమందిలో కూర్చున్నప్పుడు అల్లరి చేయాలని అందరికీ కొద్దో గొప్పో ఉంటుంది. కాని ఆ విప్లవానికి నాందిగీతం పాడగల శక్తి చాలా తక్కువమంది కుంటుంది. ఆ నాంది కాస్తా ముగిసిందా యిక నాటకం ప్రారంభం చెయ్యగల సమర్థత ప్రతివాడికీ ఉంటుంది. ఇలాంటి నాందిగీతాలు ఆలాపించే వాళ్ళను చూస్తేనే కన్యాదాతకు కడుపుమంటా, ప్రాణపోకడాను.

సూరన్న అలాంటి శ్రేణిలో అగ్రగామి. వయసొచ్చిన కుర్రాళ్ళు సూరన్నను చూశారంటే తాము వేసుకొచ్చిన ఖరీదైన కోట్లు ఆయనకు తగిలిస్తారు. "నాకెందుకర్రా ముసళాణ్ణి" అంటూనే మెత్తబడతాడు. మగపెళ్ళివారి తరఫున వచ్చిన గడుగ్గాయలు ఎప్పుడూ సూరన్న వెనకాలే తిరుగుతూ ఉంటారు. ఏకధారగా తేనీరు ఒకరోజుపాటైనా తాగి వచ్చేడేమో అనుకుంటాము అప్పుడు సూరన్నగారి ఉత్సాహం చూస్తే. ఇక మాటల ధోరణి చూస్తే పెండ్లివారు డబ్బిచ్చి తీసుకొచ్చిన కళాకారుడేమో నని భ్రమ కలుగుతుంది.

పెళ్ళివారు అప్పుడే పానకాల కావిళ్లు విడిదిలోకి ఎదురింపుకు తీసుకువెళ్ళారు. మగపెళ్ళి వారికి కాళ్లు కడుక్కొందుకని గాబుతో నీళ్లుకూడా వాకిటఉన్నై. సూరన్నవంక కన్యాదాత గట్టిగా చూశాడు, అన్నీ సమకూర్చాం లోటుపాట్లుంటే వెదకి పట్టుకోవచ్చునన్నట్లు. అంతే. ఆచూపునే ఆహ్వానంగా అందుకొని నీళ్ళగాబు దగ్గరకు వెళ్లాడు. సూరన్నకు చెంబు అందించాడు యజమాని కొడుకు. చెంబు చేత్తో పుచ్చుకొని గాబులోకి తొంగిచూచి "దీనినిండా అన్నం మెతుకులేనోయ్ బావగారూ" అన్నాడు సూరన్న కన్యాదాత వంక జూచి వెకిలిగా నవ్వుతూ. కన్యాదాత నాలిక వెనక్కు చుట్టుకుపోయింది. "ఏ కుర్రాళ్ళో యిందులో అన్నం తిన్న చెయ్యి పులిమారనుకుంటాను. ఏచెక్కో పైన వేసుకో అక్కర్లేదూ. ఇంత నిర్లక్ష్యమైతే ఎలాగ. ఆకులో అన్నంపెట్టి ఉమిచినట్లుంది మీ వరస. పదండ్రా వెళ్ళి ఊరిబయట చెరువులోనే కడుక్కుందాం కాళ్ళూ" అన్నాడు సూరన్న. ఇటువైపు పెద్దలంతా కోపంగా చూశారు సూరన్నవైపు. కాని, వసపిట్టల్లా వాగేవాళ్ళే మాటరానివాళ్లల్లా మూగవోయారు. ఇక సూరన్న వెనక నిలుచున్న గడుగ్గాయలు గిరున వెనక్కు తిరిగి పోయారు.

* * *

సాయంత్రం ముహూర్తం మూలాన్ని భోజనాలు వేగం కానిస్తున్నారు పెండ్లివారు. సూరన్న బంతి (పంక్తి)మధ్య నేకూర్చున్నాడు. వడ్డించడంలో ఎక్కువపడినా తక్కువ పడినా గోలపెడుతూనే ఉన్నాడు. సూరన్న నోరు కట్టించాలని అక్కడకు వచ్చేటప్పటికి జాగ్రత్తగా వడ్డిస్తూంటే "మనిషిని చూచి వడ్డిస్తావేమయ్యా? ఒకడు నోరులేని వాడుంటాడు వాడలా పోవలసిందే?" అని అడుగుతాడు.

యజమాని యీ గోల భరించలేక "బేగే కానివ్వండి బాబూ భోజనాలు—లగ్నం దాటిపోతుంది మరి" అని చెబితే "బాగుందోయ్ అసలు భోజనాలే మానెయ్య లేకపోయావ్ ? లేకపోతే వట్టి చారూ మెతుకులూ చేయించలేకపోయావా? పెళ్ళి భోజనాలా మరోటాయిది?" అని నోరు నొక్కేశాడు.

యజమాని వడ్డించేవాళ్ళను హుషారు జేస్తున్నాడు. ఇదీ కంటకంగానే కనుపించింది కాబోలు సూరన్నకు.

"ఏమండోయ్ కన్యాదాతగారూ! యిలా దయచేయండి బాబూ ఒక్క పర్యాయం!" అని పిలిచాడు.

యజమాని గుండెలు పిడికిటితో పట్టుకొని సమీపించాడు.

"యిదిగో యీ బూరి తీసెయ్యండి" అన్నాడు వేలుతో చూపుతూ.

"అదెంత, భోంచెయ్యండి బావగారూ!" అని సమాధానమిచ్చాడు యజమాని.

"భోంచెయ్యడానికేమిగాని యిది వెంట్రుకలతో వచ్చిన సామానండి" అన్నాడు మొహం ఎర్రబరచుకొని.

యజమాని బూరిపరకాయించి చూచి సిగ్గుపడి కోపం తెచ్చుకొని బూరె తీస్తూ యింట్లో ఆడంగుల మీద విరుచుకపడడం ప్రారంభించాడు. కాస్సేపు గడచిన తర్వాత సూరన్న పక్కవాడి విస్తరి కాళీగా ఉండడంచూచి "రెండు పనస తొనలు తినరాదూ?" అన్నాడు పైకి.

"వద్దులెండి" అని మూలిగాడు పక్కాయన.

"తీసుక రమ్మంటారా?" అని వడ్డించే కుర్రాడు గద్దించాడు. "అడిగి పెడతావేమిటయ్యా? పట్టుకరా నాలుగుతొనలు" అన్నాడు సూరన్న నిర్మొహమాటంగా. వడ్డించే ఆయన లోపలకు వెళ్ళిపోయాడు. ఐదు నిమిషాలు గడి

చిపోయినా ఆయన వచ్చేజాడ కనుపడలేదు. మరోకాయన అన్నం పట్టుకొచ్చాడు.

"చూడండి, పనస తొనలు తెస్తానని లోపలకు వెళ్ళాడు ఒకాయన. చాలా సేపైంది, ఒకసారి లోపుకి కబురు చేయండి." అని నూరన్నగారు ఆజ్ఞాపించారు. అన్నం వడ్డించే ఆయన వెర్రిమొహం వేశాడు.

"అలా చూస్తావేమిటయ్యా? లేకపోతే లేవని చెప్పాలిగాని, పట్టుకొస్తానని లోపలికిపోయి యిక ఊడిరాకపోతే యివతల వీళ్ళ పనేంగాను?" అన్నాడు నూరన్న విసురుగా. ఇలాగే తినేది తింటూ పెండ్లివారిని అభాస చేశాడు.

లగ్నం దగ్గరకు వచ్చిన తర్వాత కూడా నూరన్న మొండితనం నగ్నంగా కనబరుస్తూనే ఉన్నాడు. ముక్కైచోటా, ముట్టజెప్పవలసిన చోటా కూడా అనవాయితీని అండగా బెట్టుకొని లాభసాటిగా ప్రవర్తించేవాడు. పెళ్ళికొడుకు తండ్రి - చేస్తున్నది దౌర్జన్యం అని గ్రహించినా మానవత్వం దెబ్బతినకుండా లాభసాటిగా జరిగిపోతున్న మూలాన్ని తాత్కాలికాభిమానం నూరన్న మీద కలుగుతూనే ఉంది.

ఆడవాళ్ళకు ప్రతీకారవాంఛ మగవాళ్ళకన్నా హెచ్చు. భోజనాల దగ్గరనుంచీ నూరన్న చేస్తూన్న మొండి పనులు చూచి ఉడుకుబోతుతనం కొద్దీ కొబోలు పెండ్లికూతురు తల్లి అప్పగింత సమయంలో కళ్ళనీరు తెచ్చుకొని ప్రక్కగా నిలబడి ఉన్న నూరన్న మీద చూడనట్లు బుర్రునచీది బొజ్జ నేసి కొట్టింది. నూరన్న యజమానురాలు వైపు ఎర్రగా ఒక్కసారి దృష్టిసారించి కోపాన్ని సముదాయించుకొన్నాడు. తాను పెండ్లిలో చేసిన ప్రతిపనీ కీర్తికాముడై చేసినట్లు తలచుకొని తృప్తిపడ్డాడు.

"అందుకే యింత మొండిఘటం మూలాన్నే వీడితో పడలేక పెద్దకొడుకు దేశాలంట తిరుగుతున్నాడు. కార్యమేదైనా చేసి చూస్తే తెలుస్తుంది గాని వయసొచ్చినంతలో తెలుస్తుందా? మొన్న ఈ మధ్య ఏమైందో తెలుసా, చవగ్గా పడేసుకుందామని గంగిరెద్దునో దాన్ని ఒంటెద్దుబండికని కొన్నాడు. బండిగట్టి తోలుతూంటే అలవాటుచొప్పున ప్రతి గుమ్మం దగ్గరా ఆగుతూంటుంది అది. మళ్ళీ కొడితేనే గాని ముందుకు నడవదు. ఇదిగో యిలాంటి వేమన్నా బయటపెడితే ఏడుస్తాడు వెధవ" అన్నాడు కన్యాదాతనాతో నూరన్న వెళ్ళిపోయిన చాలసేపటికి.

# శస్త్రచికిత్స : మెదడు

గుంటుపల్లి రాధాకృష్ణమూర్తి

వ్యాధి ముదిరి, మందులకు జవాబు చెప్పకపోతే, వైద్యుడు శస్త్ర చికిత్స చేసి, వ్యాధి నివారణ చేస్తాడు. ఈ విషయం మన కందరికీ తెలిసిందే. అయితే, శస్త్ర చికిత్స అంటేసరి, మనకు అపరిమితమైన భయం పుట్టుకొస్తుంది! పోనీ, కాలో చెయ్యో అయితే ఫరవాలేదు లెమ్మని ఆపరేషనుకు అంగీకరించటం కద్దు. కానీ, ఆ వ్యాధి మెదడుకో, గుండెకో సంబంధించిందైతే, ఆపరేషన్ ప్రమాదమైందనే మనందరి ఊహ.

మెదడు ఆపరేషన్లు ఇండియాలో అంతగా ప్రబలలేదు. దీనికి ముఖ్యమైన కారణాలు రెండు. ఈ చికిత్సావిభాగంలో తరిఫీదు పొంది, ఆరితేరిన వైద్యులు బహు కొద్దిమంది. ఆదీకాక, రోగి పిచ్చివాడో, వెర్రివాడో ఊపిరితో ఉంటే చాలని ఆప్తులు ఉపేక్షించి ఊరుకోటం.

మనం వేలు చూపించి "వీడు పిచ్చివాడు" అని ఎగతాళి చేస్తాం. పిచ్చివాడూ మనలాంటి మనిషేననీ, అయితే మెదడు జబ్బువల్ల అతను ఇలా మారిపోయాడనీ మనం విస్మరిస్తాం. ఈ విషయం దృష్టిలో ఉంచుకుని మెదడు జబ్బుల వైద్యాన్ని గురించి స్థూలంగా చూద్దాం.

మొట్టమొదట ఒక మనిషి మెదడులో పెరిగిన గ్రంథిని శస్త్ర వైద్యంవల్ల తీసివెయ్యడం లండన్ నగరంలో రమారమి అరవై ఏడు సంవత్సరాల క్రితం జరిగింది. అదే మెదడు